

బైరాందేవ్ విగ్రహానికి అభిషేకం చేస్తున్న కొరంగే వంశీయులు

## బైరాందేవ్ ఆలయంలో ప్రత్యేక పూజలు

బేల,సెప్టెంబర్30 : మండలంలోని సదల్‌పూర్ సమీపంలోని మహాదేవ్,బైరాందేవ్ ఆలయాల్లో శనివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఇక్కడ కొలువైన దేవుడి రూపం ఎలా ఉంటుందో ఊహించుకోవడమే తప్ప ఎవరికీ తెలియదు. శతాబ్దాలుగా భక్తులు స్వామి విగ్రహాలకు చందనం రాయడంతో దేవుడి రూపం లేకుండా పోగా.. తలపై భాగం ఎత్తుకు పెరిగిపోయింది. బుధవారం రాత్రి సమయంలో ఒక్కసారిగా మీటరు పొడవైన చందనం కిందపడిపోవడంతో దేవుడి నిజరూపం బయటపడింది. గమనించిన అర్చకుడు విషయాన్ని స్థానికులకు తెలియజేయడంతో ఆయల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిత్యం భజన సంకీర్తనాలతో జాగరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలోపంచామృతాలతో అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలను అలంకరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుడు కొరంగే రాందాస్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా బైరాందేవ్ మహాదేవ్‌లకు పూజలు నిర్వహిస్తున్న భక్తులకు బైరాందేవ్ నిజ స్వరూపం దర్శించుకోవడం అదృష్టమన్నారు. బైరాందేవ్ నిజరూపం చూడడానికి శనివారం చాలా గ్రామాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకుంటున్నారని చెప్పారు. ఆలయ సమీపంలో మహాఅన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెందుర్ శారద, కొరంగే వంశీయులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్పత్తి సంఘాల ఏర్పాటుతో రైతులకు మేలు

కడెం, సెప్టెంబర్ 30: మామిడి రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటుతో రైతులకు మేలు జరుగుతుందని ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి శ్యామ్‌రావు రాథోడ్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కల్లెడ, నవాబుపేట గ్రామాల్లో రైతులతో మామిడి రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటుతో రైతులకు కలిగే లభాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్యామ్‌రావు రాథోడ్ ,పెంబి రైతు ఉత్పత్తి సంఘం చైర్మన్ రామేశ్వర్‌రెడ్డి రైతులకు ఉత్పత్తి సంఘాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలి, దాని వల్ల రైతులకు కలిగే లాభాలు, ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ గురించి వివరించారు. అలాగే రిలయన్స్ ఫౌండేషన్ ద్వారా రైతులకు రిజిస్ట్రేషన్, శిక్షణ, ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన అధికారి మానిక, రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రాజెక్టు అధికారి రాజేందర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ పుణ్యానాయక్, సర్పంచ్‌లు విజయ, లావణ్య, రైతులు ఉన్నారు.

## జిల్లా స్థాయి డ్రామా ఫెస్టివల్ నిర్వహణ

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్,30: మానవ జాతి ప్రయోజనం కోసం శాస్త్ర సాంకేతికత అనే ప్రధాన అంశం పై జిల్లా స్థాయి డ్రామా ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రవిందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యం ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఎనిమిదో తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలన్నారు. 1, మిల్లెట్ నాణ్యమైన ఆహారం, 2, ఆహార భద్రత, 3, రోజువారి జీవితంలో ఆధునిక సాంకేతికత, 4, ఆరోగ్య సంరక్షణలో ప్రస్తుత పురోగతి, సమాజంలో మూఢ నమ్మకాలు అనే అశం పై ఉంటుందన్నారు. 1. ప్రజెంటేషన్ ఆఫ్ ది డ్రామా 50 మార్కులు, 2, సైంటిఫిక్ కాంటెంట్ ఇన్ ద డ్రామా 30 మార్కులు, ఎఫెక్టివ్‌నెస్ ఆఫ్ ది డ్రామా 20 మార్కులు ఉంటాయన్నారు. స్టేజి ఏర్పాటుతో కలిసి డ్రామా 30 నిమిషాలు, ప్రతి టీంలో ఒక డైరెక్టర్, స్క్రిప్ట్ రైటర్ కలిపి 10 మందికి దాటకూడదన్నారు. ఇతర వివరాలకు ఎస్‌వో నర్సయ్య సెల్ 9949263712, వినోద్‌కుమార్ డీఎస్‌వో 94400 69830 ను సంప్రదించాలన్నారు.

## చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ఇంద్రవెల్లి, సెప్టెంబర్30: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏజెన్సీలో 1/70చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదివాసీ సంఘాల సమన్వయ కర్త సిడాం భీంరావ్ కోరారు. శనివారం మండలంలోని కెస్లాపూర్ నాగోబా దర్బార్‌హాల్‌లో కెస్లాపూర్ రాయిసెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు రాయిసెంటర్ల సమావేశం కెస్లాపూర్ సార్‌మేడి మెస్రం వెంకట్‌రావ్ పటేల్ అధ్యక్షతన నిర్వహించారు. ఏజెన్సీలోని ఆదివాసీలకు చెందిన పలు సమస్యలతోపాటు భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఏజెన్సీలో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి, జీవో 3ని యథావిధిగా అమలు చేసి ఆదివాసీలకు న్యాయం చేయాలని ఆదివాసీ గోండ్వాన పంచాయతీ రాయిసెంటర్‌ల ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో వడగాం సార్‌మేడి మెస్రం చిన్నుపటేల్, గిన్నేరా సార్‌మేడి తుంరం జుగాదిరావ్, కెస్లాపూర్ రాయిసెంటర్ గీతేదార్ కొట్నాక్ బారిక్‌రావ్, తుండుం దెబ్బ జిల్లా అధ్యక్షులు గోడం గణేష్, జిల్లా ప్రధానకార్యదర్శి పుర్కా బాపురావ్, మెస్రం వంశీయుల ఉద్యోగుల సంఘం నాయకులు మెస్రం శేఖర్‌బాబు, ఆదివాసీ పెద్దలు ఆర్కా ఖమ్ము, మెస్రం నాగ్‌నాథ్, జ్యోతిరాం, మానిక్‌రావ్, హన్మంత్‌రావ్, మారుతి, రాజేశ్వర్, జుగాదిరావ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠాల్లేవ్..ఆటలే..

- పాఠశాలల్లో ప్రతి నాలుగో శనివారం నో బ్యాగ్ డే నిర్వహణ
- ఆటపాటలతో సరదాగా గడుపుతున్న విద్యార్థులు

*విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నాలుగో శనివారం 'నో బ్యాగ్ డే' కార్యక్రమాన్ని గత సంవత్సరం ప్రవేశపెట్టి అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. అయితే ఈ నాలుగో శనివారం ఏం చేయాలో, ఏ కార్యకలాపాలు చేపట్టాలో సూచిస్తూ ఎస్సీఈఆర్టీ ప్రత్యేక పుస్తకాన్ని ముద్రించింది. ఈ మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పుస్తకాల బ్యాగులు లేకుండానే పాఠశాలకు హాజరవుతున్నారు. ఉపాధ్యాయులు ఆటలు ఆడించడం,యోగా చేయించడం, పాటలు పాడించడం వంటివి నేర్పిస్తున్నారు. విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ప్రభుత్వం నో బ్యాగ్‌డే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో హర్షం వ్యక్తమవుతున్నది. – భైంసా, సెప్టెంబర్ 30*



మిర్జాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు

విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడంలో భాగంగా ప్రభుత్వం ప్రతీ నాలుగో శనివారం నో బ్యాగ్ డేను గత సంవత్సరం ప్రవేశపెట్టింది. ఈ మేరకు ప్రతీ నాలుగో శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నో బ్యాగ్ డేను అమలు చేస్తున్నారు. విద్యార్థులు పుస్తకాల బ్యాగులు లేకుండానే పాఠశాలలకు హాజరు కాగా ఉపాధ్యాయులు ఆటలు ఆడించడం, యోగా చేయించడం, పాటలు పాడించడం, వంటివి నేర్పిస్తున్నారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

ఆదివారం వచ్చిందంటే పిల్లలకు పండుగ అన్నట్లే.. ఆ రోజున తమదైన స్వేచ్ఛా ప్రపంచంలో రెక్కలొచ్చిన పక్షుల్లా విహరిస్తారు. నెలలో ఒకరోజైన బడిలో కూడా ఇలాగే ఉంటే... అబ్బ .. ఎంత బాగుంటుందో కదా.. ఈ ఆలోచనకు ఆచరణ రూపమే నో బ్యాగ్ డే. ఇది గత విద్యా సంవత్సరం నుంచి అమలవుతుంది. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం విద్యార్థులంతా వాటర్ బాటిల్ మాత్రమే తీసుకొని బడికి వస్తున్నారు. బ్యాగులేవ్.. పుస్తకాల్లేవ్.. వచ్చినప్పటి నుంచి ఆటలే.. ఆటలు.. సందడే.. సందడి.. ఉపాధ్యాయులు కూడా పిల్లల్లా మారిపోయి.. వారితో కలిసి ఆడిపాడుతున్నారు. మధ్యమధ్యలో ఎందుకు చదువుకోవాలి..? పెద్దలను ఎలా గౌరవించాలి..? ఏది మంచో, ఏది చెడో ఎలా తెలుసుకోవాలి ? ఇలాంటి విషయాలను ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. పిల్లలపై మానసిక ఒత్తిడిని తగ్గించేలా, మనో వికాసానికి తోడ్పడేలా ప్రతి నాలుగో శనివారం నో బ్యాగ్ డేకు విద్యాశాఖ శ్రీకారం చుట్టిందని మిర్జాపూర్ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ, అనేక కొత్త కొత్త విషయాలను ఆసక్తికరంగా, ఉత్సాహభరితంగా నేర్చుకోవాలన్నదే ఈ నోబ్యాగ్ డే లక్ష్యమని చెప్పారు. చారిత్రక ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయాల సందర్శన, నమూనా ఎన్నికల ప్రక్రియ, నమూనా అసెంబ్లీ నిర్వహణ తదితరాలను నిర్వహిస్తామని తెలిపారు. పిల్లలే భాగస్వామ్యులుగా జరిగే ఇతర కార్యక్రమాలతో వారిలో ఉత్సాహం కలుగుతుందని, ఆ యా వ్యవస్థలపై అవగాహన పెరుగుతుందని వివరించారు.

# వ్యాధుల నియంత్రణకు చర్యలు

- డ్రైడే కార్యక్రమాలు, వైద్య శిబిరాలు
- ముమ్మరంగా ఇంటింటి సర్వే

నిర్మల్ చైన్‌గేట్,సెప్టెంబర్,30: కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్న దృష్ట్యా పలు వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరిస్తూ డ్రైడే కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో మలేరియా, డెంగీ, మెదడువాపు, చికున్‌గున్యా, ఫైలేరియా, వంటి వ్యాధులు ప్రబలుతాయి. తాగునీరు కలుషితమైతే డయేరియా వంటి వ్యాధి ప్రబలే అవకాశం ఉంటుంది. వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో ప్రభుత్వం, అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతోపాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

- **శుక్ర, మంగళ వారాల్లో డ్రైడే కార్యక్రమాలు..**

దోమల నియంత్రణకు అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రైడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా లార్వా దశలోనే అంతమొందించేందుకు చర్యలు చేపట్టారు. గ్రామపంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఇందుకు గాను పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మురుగుకాల్వలలో నీటి తొలగింపు, నీటి గుంతల్లో,ఆయిల్‌బాల్స్, టెమోఫాస్ వంటి మందులు పిచికారీ చేస్తున్నారు. క్లోరినేషన్ కూడా చేపడుతున్నారు.

- **గ్రామాల్లో వైద్య శిబిరాలు**

వ్యాధుల నియంత్రణకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలలో, మున్సిపాలిటీలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు నిర్వహిస్తున్నారు. ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశకార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో సర్వే చేయడంతో పాటు అవగాహన కల్పిస్తున్నారు.



మామడలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

### వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం..



వ్యాధుల నియంత్రణకు వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రజలు వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దు. అన్ని ప్రభుత్వ దవాఖానల్లో అవసరమైన మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాం. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో, పాఠశాలల్లో, గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

– డా.ధన్‌రాజ్, జిల్లా వైద్యాధికారి, నిర్మల్

## అర్చకులకు శిక్షణ

బాసర, సెప్టెంబరు 30 : బాసర అమ్మవారి సన్నిధిలో ఆదివారం నుంచి మంగళవారం వరకు అర్చకులకు శిక్షణ నిర్వహించనున్నట్లు ఈవో విజయరామారావు తెలిపారు. దీపధూప నైవేద్యంలో భాగంగా ఎంపికైన 650 మంది అర్చకులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డార్మేటరి భవనంలో అర్చకులకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

## చికిత్స పొందుతూ చినమల్లు మృతి

లక్ష్మణచాంద, సెప్టెంబర్ 30: అన్నదమ్ముల కొట్లాటలో శుక్రవారం తీవ్రంగా గాయపడిన చిలారి చినమల్లు (45) శనివారం నిజామాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.



మృతుడు చిలారి చినమల్లు

## ప్రమాదవశాత్తు యువకుడు..

కుంటాల, సెప్టెంబరు, 30: మండలంలోని లింబా (బీ) గ్రామంలో శుక్రవారం వినాయక నిమజ్జనం వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన యువరైతు జరి మల్లేశ్ (36) నిమజ్జన వేడుకల్లో పాల్గొని అదే రాత్రి ఇంటికి తిరిగి రాలేదు. మరుసటి రోజు గాలించగా ఊరి పొలిమేరలో ఉన్న కొత్త చెరువు వద్ద దస్తులు చెట్టుకు వేలాడుతుండగా గమనించారు. చెరువు వైపు చూడగా అతని శరీర భాగం కొంత తేలియాడుతూ కనిపించింది. వెంటనే సర్పంచ్ మల్లేశ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టానికి పంపించారు. మృతునికి భార్య ఒక కూతురు ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హన్మండ్లు తెలిపారు.

# పోలీసులపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

కడెం, సెప్టెంబర్ 30: మండలంలోని పెద్దబెల్లాల్ పంచాయతీ పరిధిలోని మొర్రిగూడెం గ్రామానికి చెందిన వెల్పుల తిరుపతి అనే వ్యక్తి పోలీసులపై దాడికి పాల్పడడంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కోసన రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శుక్రవారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో వెల్పుల తిరుపతి మద్యం సేవించి ఆటో నడుపుతూ ఆయన భార్యతో కలిసి బెల్లాల్ వైపు వెళ్తున్న సమయంలో వాహనం ఆపి ఎన్ బ్రీత్‌లైజర్ పెట్టే ప్రయత్నంలో నిరాకరించి పోలీసులపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. అక్కడి నుంచి కడెం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి రక్త నమూనా పరీక్షలు నిర్వహించే క్రమంలో పోలీసు విధులకు ఆటంకం కలిగిస్తూ దూషించినట్లు తెలిపారు. భార్య భర్తలు ఇద్దరు కూడా పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు, పోలీసులపై దాడికి పాల్పడిన తిరుపతి, ఆయన భార్యపై కేసులు నమోదు చేసి అలాగే ఆటోను కూడా సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, పోలీసులపై దాడికి యత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.